క్లుప్తంగా

ఇద్దరి అరెస్టు


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మండపేట: తాపేశ్వరం లాకుల వద్ద, ద్వారపూడి శివారు ప్రాంత వేములపల్లిలో తన సిబ్బందితో కలసి సారా స్థావరాలపై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. లాకుల వద్ద గోర్తా నూకమ్మను 3 లీటర్ల సారాతో పట్టుకున్నారు. వేములపల్లి వెంకటపద్మావతి నగర్లో బత్తుల నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అక్కడే ఉన్న జీడిమామిడి తోటలో 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించినట్టు తెలిపారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కాజులూరు: గ్రామాల్లోని గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ఏఎన్‌ఎంలు, హెల్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని గొల్లపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ వైకుంఠరావు అన్నారు. గురువారం పీహెచ్‌సీలో జరిగిన ఆశా వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలను ఆరోగ్య సిబ్బంది తరచూ పరీక్షలు చేస్తూ, వారికి అవసరమైన మందులు క్రమం తప్పకుండా తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆహార నియమాలు, దినచర్యల పైనా వారికి తగిన సూచనలు అందించాలన్నారు.

గొల్లపాలెం ఎస్సైగా మోహన్‌కుమార్


బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మోహన్‌కుమార్

కాజులూరు: గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎస్సైగా ఎం మోహన్‌కుమార్ నియమితులయ్యారు. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక జరుగుతున్న బదిలీల నేపథ్యంలో గత రెండేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై తులసీరామ్‌ను నెల రోజుల క్రితం కాకినాడ వీఆర్‌కు పంపారు. ఇక్కడకు ఎస్సైగా వస్తున్నట్టు పలువురి పేర్లు వినిపించినప్పటికీ, గొల్లపాలెంలో పోస్టింగ్ తీసుకునేందుకు ఎవ్వరూ సుముఖత చూపకపోవటంతో, మరళా ఎస్సై తులసీరామ్‌నే ఇక్కడ కొనసాగించారు. అయితే రంపచోడవరంలో పనిచేస్తున్న ఎం మోహన్‌కుమార్ ఇక్కడకు బదిలీ కావడంతో గురువారం ఆయన స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు.

బస్‌పాస్ కేంద్రం సేవలు నిలిపివేత


రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపోలోని బస్ పాస్ కేంద్రం సేవలు రెండు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో నూతన సాంకేతిక విధానానికి మార్పు చేస్తున్న కారణంగా ఈ కేంద్రాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి ఏడో తేదీ నుంచి బస్ పాస్‌లు జారీ చేస్తారన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సత్కారం


పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించి, జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ద్రాక్షారామకు చెందిన వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం జేసీ నిషాంతి నుంచి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ద్రాక్షారామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి సూర్యసుబ్రహ్మణ్యంను గ్రామస్తులు గురువారం ఘనంగా సత్కరించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ మాట్లాడుతూ, ఆయనను ఆదర్శంగా తీసుకుని పంచాయతీ, సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు.

హెల్త్ కార్డుల పంపిణీ


హెల్త్ కార్డులు అందజేస్తున్న సర్పంచ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో జరగాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం ఆయుష్మాన్ హెల్త్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో మొక్కలను నాటారు. గ్రామానికి చెందిన చింతపల్లి అర్జున్, కార్యదర్శి సీహెచ్ భాస్కరలక్ష్మి, వివిధ విభాగాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి చేతిలో వైకుంఠం

- అన్నదాతలకు ప్రభుత్వం లేనిపోని ఆశలు
- సాగు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు
- మీనమేషాలు లెక్కిస్తున్న పాలకులు
- ఇప్పటికే తుది దశకు చేరుకున్న ఖరీఫ్ సాగు
- ఆందోళన చెందుతున్న రైతులు


కె.గంగవరం మండలంలోని పంట పొలాలు

కె.గంగవరం: ధాన్యాగారమైన రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్ మండలాల్లో తొలకరి పంట చివరి దశకు చేరుతున్నా.. నేటికీ ప్రభుత్వ సాయం మాత్రం అందలేదు. ఎన్నికల ముందు కూటమి నేతలు సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రతి రైతుకు రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఊదరగొట్టారు. రైతులను నమ్మించి ఓట్లు దండుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు తమను పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. 2019కి ముందు కూడా రైతులకు ఇదే అనుభం ఎదురైంది. అప్పట్లోనూ అండగా ఉంటామని హామీ ఇచ్చిన టీడీపీ.. ఐదేళ్ల పాలన సాగించినా, రైతులను కన్నెత్తి చూడలేదు. ఇప్పటికే ఈ ఏడాది వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న రైతులు.. ప్రభుత్వం అందించే సాగు సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

సాయంలో జాప్యం

కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించడంపై మీనమేషాలు లెక్కిస్తోంది. అర్హుల జాబితా పక్కాగా ఉన్నప్పటికీ, సాయం చేయడంలో జాప్యం చేస్తోంది. దీంతో రైతు భరోసా పథకంపై సాగుదారుల్లో ఆందోళన నెలకొంది. గత ఐదేళ్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు కొద్ది రోజుల ముందే తొలి విడత సాయం రూ.5,500 రైతుల ఖాతాల్లో జమ చేసేది. కానీ కూటమి ప్రభుత్వం నేటికీ సాగు సాయంపై ప్రకటన కూడా చేయలేదు. దీంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లు ఏడాదికి రూ.13,500 వంతున అందించింది. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్‌లో భాగంగా ఆ మొత్తాన్ని రూ.20 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

సాగు విస్తీర్ణం ఇలా..

రామచంద్రపురం నియోజకర్గంలోని కె.గంగవరం మండలం, కాజులూరు, రామచంద్రపురం మండలాల్లో సుమారు 21,688 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. కె.గంగవరం మండలంలో 6,344 హెక్టార్లు, కాజులూరు మండలంలో 7,702 హెక్టార్లు, రామచంద్రపురం రూరల్‌లో 7,642 హెక్టార్లలో వరి సాగవుతోంది.

గత ప్రభుత్వంలో..

వ్యవసాయం గత ప్రభుత్వం హయాంలో పండగలా మారింది. రైతు భరోసా పథకం కింద ఒక్కొక్క రైతుకు ఏడాదికి రూ.13,500 వంతున అందుకున్నారు. తొలి విడతగా రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు ముందే రూ.5,500 అందించింది. రెండో విడతగా మరో రూ.2 వేలను జమ చేసేది. దీనికితోడు పీఎం కిసాన్ పథకం నిధులు సైతం రూ.2 వేల చొప్పున మూడు పర్యాయాలు అందించేది. ఇలా ఏడాదికి సరాసరి సాగు చేసే రైతులందరినీ అర్హులుగా భావించి సాయం అందించింది.

రూ.25 కోట్లకు పైగా..

ఒక్క రామచంద్రపురం నియోజకవర్గంలోనే ఐదేళ్లలో రూ.25 కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జమ చేసింది. మూడు విడతలుగా రైతులకు సాయం అందించడంతో ఏడాది పొడవునా రైతుల చేతుల్లో డబ్బు పుష్కలంగా ఉండేది. ఫలితంగా వ్యవసాయ పనులు నిరాటంకంగా సాగేవి. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల సాయం అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఊదరగొట్టిన కూటమి నేతలు.. అధికారం దక్కించుకున్నారు. ఖరీఫ్ చివరి దశకు వస్తున్నా కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంపై కనీసం నోరు విప్పడం లేదు. అసలు తొలి విడత సాయం ప్రభుత్వం ఎంత ఇస్తుందో కూడా తెలియని పరిస్థితి రైతుల్లో నెలకొంది. ఇదిలా ఉండగా, ఈ ఖరీఫ్ ప్రారంభంలో కూటమి ప్రభుత్వం రైతులకు రుణ అర్హత పత్రాలు మంజూరు చేసి అధికారులు పంపిణీ చేశారు. దీంతో రైతుల్లో కొత్త ఆందోళనలు పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది సాగు సాయం చేయకుండా, బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తుందేమోనని కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోతారన్న వాదనలు వినిపిస్తున్నాయి. వ్యవసాయం మరోసారి నష్టాల్లోకి వెళుతుందని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భయమేస్తోంది



ప్రభుత్వం ఇప్పటి వరకూ సాగు సాయం చేయకపోవడంతో భయమేస్తోంది. పెట్టుబడి కోసం ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఏడాదికి రూ.20 వేల సాయం చేస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటనా చేయలేదు. రైతులు ధైర్యంగా సాగు చేయాలంటే కూటమి ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం ఇవ్వాలి.

– తోకల శ్రీను, రైతు, తామరపల్లి

అమలుపైనే అనుమానాలు



రైతు భరోసా పథకం అమలు చేస్తారా, లేదా అనే అనుమానాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటి వరకూ ఒక్క పైసా కూడా రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ఇప్పటికే ఒక్కో రైతు రూ.వేలల్లో పెట్టుబడి పెట్టారు. ఇక నుంచి అప్పల కోసం తిరగాల్సిన పరిస్థితి ఉంది. గతంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఖరీఫ్ ప్రారంభం ముందే రూ.5,500 మంజూరు చేసి ఖాతాల్లో వేసేవారు.

– ఇళ్లా సూర్యనారాయణ, శివల

నాయకుడు మరణించినా ప్రజల్లో జీవించే ఉంటాడు

సూర్యప్రకాష్


మాచరమట్టలులో గోవిందుకు నివాళి అర్పిస్తున్న సూర్యప్రకాష్

కపిలేశ్వరపురం: ప్రజల్లో నిత్యం ఉన్న నాయకుడు మరణించినా చిరస్థాయిగా జీవించే ఉంటాడని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గం కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. కపిలేశ్వరపురం మండలం మాచర గ్రామ శివారు మాచరమట్టలులో పార్టీ మండల కన్వీనర్ శీలం గోవిందు సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. తొలుత మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల నాయకులతో కలిసి గోవిందు చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల అర్పించారు. భార్య సుభాషిణి, కుమారులు పవన్, రామనారాయణలను ఓదార్చారు. సంస్మరణ సభలో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పార్టీ అభ్యున్నతికి కృషి చేయడంతోపాటు తన సామాజికవర్గంలోని పేద, మధ్య తరగతి ప్రజల సమస్యలపై గోవిందు పోరాడారన్నారు. పార్టీలకు, కులాలకు అతీతంగా అందరూ మెచ్చుకునేలా గోవిందు ప్రజల్లో నిలిచారన్నారు. గోవిందు కుటుంబ సభ్యులకు తాము ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ఉద్యోగుల సంఘం నాయకుడు జిత్తుక మల్లికార్జునుడు, రాయవరం మాజీ ఎంపీపీ సిరివరపు శ్రీనివాస్, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కొప్పిశెట్టి వాసు, వాసంశెట్టి వాసు, పలివెల మధు, సలాది వీరబాబు, కట్టా మురళి, వంగా శ్రీనివాసు, మేడిశెట్టి గోవిందు, మల్లిపూడి శివ కుమార్, మాచరుమట్ల గ్రామ పెద్దలు మాట్లాడుతూ గోవిందును స్మరించుకున్నారు.

కాల్‌మనీ బాధితులకు అండగా ఉంటాం


మీడియాతో మాట్లాడుతున్న లాయర్ గోవిందరావు

మండపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కాల్ మనీ బాధితులకు తమ సంస్థ అండగా ఉంటుందని సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడు సామాజిక అభివృద్ధి విషయాల అధ్యయన సంస్థ ఫౌండర్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది టీవీ గోవిందరావు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండపేట పట్టణంలో గత పదేళ్లుగా కాల్ మనీ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతుందన్నారు. తొలుత రోజువారి వడ్డీలు, వారాంతపు వడ్డీలు, నెలవారీ వడ్డీలతో ప్రారంభించిన ఈ కాల్ మనీ వ్యాపారులు తొండ ముదిరి ఊసరవెల్లిన అయిన చందంగా ఈ వ్యాపారులు రాజకీయ నాయకులను సైతం శాసిస్తున్నారని గోవిందరావు వివరించారు. భర్తలు ఇంట్లో లేని సమయంలో కాల్‌మనీ వ్యాపారులు ఇంట్లోకి చొరబడి వారి భార్యలను లైంగికంగా వేధిస్తున్నారని ఆయన వివరించారు. పోలీస్ స్టేషన్లకు వెళ్లినా కేసులు నమోదు కావడం లేదని బాధితులు వాపోతున్నారన్నారు. ఈ విధంగా కాల్‌మనీ వ్యాపారుల చేతుల్లో చిక్కుకున్న వారికి తమ సంస్థ తరపున అండగా నిలబడతానని గోవిందరావు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వండి

చెల్లూరు, వెంటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం


చెల్లూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ ప్రభాకర్

రాయవరం: రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ పిలుపునిచ్చారు. మండలంలోని చెల్లూరు, వెంటూరు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి రైతు తన పొలంలో కొంత భాగాన్ని ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ద్వారా మంచి ఆరోగ్యకరమైన పంటను పండించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ పొలంలో కొంత భాగంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని తెలిపారు. గత పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు కాదా శ్రీనును ఏవో ప్రభాకర్ అభినందించారు. పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ విజయ్ మాట్లాడుతూ పశువులకు వ్యాధులు రాకముందే టీకాలు వేయించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి పశు గణన చేపట్టడం జరుగుతుందని, పశు సంవర్ధక శాఖ నుంచి వచ్చే అధికారులు, సిబ్బందికి పాడి రైతులు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులకు బరకాలు, స్ప్రేయర్లు, చిన్న ట్రాక్టర్లను రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చేలా చూడాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు. ప్రకతి వ్యవసాయంలో గత పది సంవత్సరాల నుండి కాదా శ్రీను చేసినట్టుగా ప్రతి రైతు కూడా చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వాసంశెట్టి విజయకుమార్, మాజీ వైస్ ఎంపీపీ దేవు శ్రీను, మాజీ ఎంపీటీసీ చిరట్ల అప్పారావు, స్థానిక నేత దేవళ్ల వెంకట్రావు, వ్యవసాయ సహాయకులు కృష్ణతేజ, హేమంత్, చినరాజు, రైతులు పాల్గొన్నారు.

చోడవరంలో పొలం పిలుస్తోంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని చోడవరంలో వ్యవసాయ శాఖ, అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నేదునూరి సంతోషమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. సత్యప్రసాద్, ఏడీఏ ఏవీ రంగారావు, పశు వైద్యాధికారి విజయదుర్గ రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ప్రత్యేక భవన సముదాయం

- రేపు ప్రారంభోత్సవానికి సిద్ధం
- బ్లాక్ ఏర్పాటుతో సుదీర్ఘ సమస్య పరిష్కారం
- డాక్టర్ బలుసు సుబ్బారావు, వసుంధర దంపతుల ఔదార్యం


ప్రారంభానికి సిద్ధమైన ప్రత్యేక బ్లాక్

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర–పడమర ఖండ్రిక పీహెచ్‌సీలో ప్రత్యేక బ్లాక్ నిర్మితమైంది. సుదీర్ఘకాలంగా వెంటాడుతున్న సమస్య బ్లాక్ నిర్మాణంతో పరిష్కారమైంది. పేద, మధ్య తరగతి ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలందనున్నాయి. అంగర గ్రామానికి చెందిన బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ బలుసు సుబ్బారావు, వసుంధర దంపతులతో ఈ ప్రత్యేక బ్లాక్ భవనం నిర్మించారు. దాతల ఔదార్యాన్ని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. శనివారం ఉదయం భవనాన్ని రాష్ట్ర మాజీ మంత్రి కై కలూరు శాసన సభ్యులు కామినేని శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఇరు గ్రామాల సర్పంచులు తిరునాతి ఆదిలక్ష్మి, వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పెద్దిరెడ్డి శేషారత్నం, అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు దాతల కృషిని అభినందించారు. గ్రామానికి చెందిన దాత డాక్టర్ సుబ్బారావు 1944లో ఎంబీబీఎస్ పూర్తి చేసి 1972లో అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. 74 ఏళ్ల వయస్సులో 2000 సంవత్సరంలో అమెరికాలో వైద్య వృత్తికి స్వస్తి చెప్పారు. గత కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. అమెరికాలో స్థిరపడినా సుబ్బారావు స్వగ్రామమైన అంగర, పడమర ఖండ్రిక గ్రామాల అభ్యున్నతికి కృషి చేస్తూ వచ్చారు. ప్రస్తుతం రూ.75 లక్షలతో పీహెచ్‌సీలో భార్య వసుంధర జ్ఞాపకార్థం ప్రత్యేక బ్లాక్‌ను నిర్మించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్థుల చదువులకు సాయమందించారు. 1976లో తండ్రి రుద్రయ్య పేరున ఉన్నత పాఠశాల భవనాన్ని నిర్మించారు. రూ.8 లక్షలతో పాఠశాల ఆవరణల కళావేదికను నిర్మించారు. ఇలా సేవా కార్యక్రమాలను చేస్తున్న డాక్టర్ సుబ్బారావును ఇరు గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రత్నకుమారి, ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా దేవీ నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం


పసలపూడిలో పూజలు ప్రారంభిస్తున్న రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, శ్రీధర్ దంపతులు


పీఠంలో భక్తులు ఏర్పాటు చేసుకున్న సామూహిక కలశాలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి సుభాష్


కలువపువ్వు సెంటర్లోని ఆలయంలో బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనం


శ్రీబాలాత్రిపురసుందరీ దేవి అలంకరణలో విజయదుర్గా అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో మాణిక్యాంబ అమ్మవారు


కపిలేశ్వరపురం ఆలయంలో కిరీటాన్ని అమ్మవారికి అలంకరిస్తున్న దాతలు

మండపేట: శ్రీదేవీ శరన్నరాత్ర ఉత్సవాలు మండపేట, రూరల్ మండలంలోని 12 గ్రామాల్లోను గురువారం వైభవంగా ఆరంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా కమిటీ నిర్వాహకులు ప్రత్యేకంగా మంటపాలు నిర్మించి, వీధుల్లో రంగరంగుల విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. కలువపువ్వు సెంటర్లో కొలువుతీరిన కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని బంతి చామంతి రకాల పూలతో బాలత్రిపుర సుందరీ దేవిగా అర్చకులు అయినవిల్లి రాజరాజేశ్వర రుద్రశర్మ అలంకరణ చేశారు. కొండపల్లి వారి వీధి దుర్గమ్మ, అంకసాని చెరువు గట్టుపై వెలసిన దుర్గమ్మ ఆలయం, గాంధీనగర్ రైతుబజార్ వద్ద విజయదుర్గమ్మ ఆలయంలోను విశేష పూజాధికాలు జరిపారు. అదేవిధంగా సత్యశ్రీ రోడ్డు దుర్గమ్మ ఆలయంలోను ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో పెద్ద ఎత్తున భవాని మాలధారణలు చేశారు. ఏడిద బల్లగేటు సెంటర్లో దుర్గమ్మ ఆలయంలో అర్చనలు, పూజలు జరిగాయి. తొలిరోజు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకోవడానికి మహిళలు, చిన్నారులు, భక్తులు బారులు తీరారు. నాయుళ్ల గుడి వీధిలో తాపీమేస్త్రీలు, టైల్స్ మేస్త్రీలు కమిటీగా ఏర్పడి వైఎస్సార్ సీపీ నాయకుడు యర్ర గుంట అయ్యప్ప ఆధ్వర్యంలో వేడుకలు ప్రారంభమయ్యాయి.

సిరుల తల్లి.. కల్పవల్లి

రాయవరం: శరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తజనావళితో పూజలందుకునేందుకు దుర్గామాత ఊరూరా కొలువుదీరింది. గ్రామాలు భవానీ నామ స్మరణతో మార్మోగాయి. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి గ్రామంలో వాడవాడలా పలు చోట్ల ఉత్సవ కమిటీలు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించారు. మండలంలోని రాయవరం, వి.సావరం, వెదురుపాక, లొల్ల, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, మాచవరం, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి, కూర్మాపురం గ్రామాల్లో శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. పలు చోట్ల భక్తులు ఉత్సవ కమిటీలుగా ఏర్పడి చలువ పందిళ్లు వేసి అమ్మవారి విగ్రహప్రతిష్ఠలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అమ్మను దర్శించేందుకు వేకువజాము నుంచి భక్తులు బారులుతీరారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, శ్రీధర్ దంపతుల చేతుల మీదుగా కలశారాధన ప్రారంభించారు. కర్రి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో తొలుతగా భక్తులు గ్రామోత్సవం చేపట్టారు.

విజయదుర్గా పీఠంలో..

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో గురువారం శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.19 గంటలకు హస్త నక్షత్రయుక్త రవిహోరలో పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, సూర్యరాజ్యలక్ష్మి, పీఠం భక్తజన సంఘం సభ్యుడు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి దంపతులు కలశస్థాపన ప్రతిష్ఠించి పూజలు చేశారు. విజయదుర్గాదేవి ఉత్సవమూర్తి సహిత పంచాయతన దేవతలు, శ్రీదేవి, భూదేవి సమేత విజయవెంకటేశ్వరస్వామి విగ్రహాల మధ్య వేలాది మంది భక్తులు కలశాలను ఏర్పాటు చేసుకున్నారు. తొలిరోజు 1,116 మంది కలశాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా పీఠంలో పూజలు, హోమాలు జరిగాయి. పీఠానికి హాజరైన భక్తుల నుద్దేశించి పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి మాజీ రీజనల్ కోఆర్డినేటర్ కందర్ప హనుమాన్, సాహితీవేత్త గొర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజాధికాలు నిర్వహించారు. పీఠం పీఆర్వో వి.వేణుగోపాల్(బాబి), పీఠం ప్రతినిధులు భాస్కరనారాయణ తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో దసరా ఉత్సవాలు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో 12వ శక్తి పీఠం మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో దసరా ఉత్సవాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం ప్రారంభించారు. ఆలయ ఈఓ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వసంత మండపంలో అమ్మవారి మట్టి ప్రతిమను తొలిరోజు శ్రీరాజరాజేశ్వరి అవతారంలో అలంకరించారు. కార్యక్రమంలో వేగాయమ్మపేట జమిందారు వాడ్రేవు సుందర రత్నాకరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి కిరీటం సమర్పణ

కపిలేశ్వరపురం: స్థానిక పెద్ద కాలువ గట్టున కొలువైన విజయదుర్గ అమ్మవారికి గ్రామానికి చెందిన భక్తుడు రూ.80వేలు విలువ చేసే వెండి కిరీటాన్ని సమర్పించారు. కొప్పిశెట్టి సత్య కుమారుడు లక్ష్మణ్ కిశోర్, బిందు రాజ్యలక్ష్మి దంపతులు కేజీ వెండితో కిరీటాన్ని తయారు చేయించారు. ఆలయంలో గురువారం అమ్మవారి అలంకరణ నిమిత్తం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ నిర్వాహకులు అభినందించారు.

ద్రాక్షారామలో కాశీవాసుల చండీ హోమం


ద్రాక్షారామలో చండీ హోమం నిర్వహిస్తున్న కాశీవాసులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయ క్షేత్రంలో కాశీకి చెందిన శ్రీపాదుక ఆచార్య కొల్లూరు అవతార్‌శర్మ గురూజీ, వెంకటరమణమ్మ దంపతులు, వారి శిష్య బృందం ఆధ్వర్యంలో శరన్నవరాత్రులను పురస్కరించుకుని గురువారం చండీ హోమం నిర్వహించారు. దసరా తొమ్మిది రోజులు చండీ హోమం నిర్వహిస్తారని ద్రాక్షారామకు చెందిన శ్రీరాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ తెలిపారు.

చట్ట సవరణ అమలుపై న్యాయవాదుల నిరసన


బార్ అసోసియేషన్ వద్ద నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

రామచంద్రపురం: న్యాయవాదుల చట్ట సవరణకు వ్యతిరేకంగా రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ వాడ్రేవు, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ, ఈ చట్ట సవరణ న్యాయవాదుల హక్కులను కాలరాసే విధంగా ఉందన్నారు. దీని వల్ల బార్ కౌన్సిళ్ల అస్తిత్వాన్ని, స్వయం ప్రతిపత్తిని, ఉనికిని దెబ్బతీసేలా ఉందని న్యాయవాదులు విమర్శించారు. న్యాయవాద వృత్తితో సంబంధం లేని వ్యక్తులను మండళ్లలో చేర్చి, వాటి వ్యవహారాల్లో తలదూర్చేలా ఈ సవరణ ఉందని మండిపడ్డారు. క్రమశిక్షణ కమిటీలో వృత్తితో సంబంధం లేని వ్యక్తులను చేర్చేలా ఈ సవరణ చట్టం ఉందన్నారు. ఈ చట్ట సవరణలతో న్యాయవాది వృత్తి కార్పొరేటీకరణకు దారితీస్తుందని వాపోయారు. వెంటనే ఈ చట్టాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీ, సీనియర్ న్యాయవాదులు టి.చలపతి, లకాని కమల కుమారి, కేవీవీ సత్యనారాయణ, కె.లోవరాజు, గాలింకి చిట్టిబాబు, దొమ్మలపాటి సత్యనారాయణ, వై.దుర్గాప్రసాద్, ఎస్.హరికృష్ణ, ఐ.చంద్రరావు, నేలపాటి వీరభద్రరావు, చోడే జాన్ రత్నం, మండ సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.